

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శుక్రవారం 23-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :125 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

టీవీ ఛానెళ్లకు కేంద్రం వార్నింగ్!



నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఉగ్రవాద ఆపరేషన్ల లైవ్ ప్రసారాలపై నిషేధం

హింసాత్మక దృశ్యాల ప్రసారంలో జాగ్రత్త

బాధితుల గుర్తింపు బయటపెట్టొద్దు

మత విద్వేషాలకు తావివ్వొద్దు

ఏఐ కంటెంట్‌పై ఎడిటోరియల్ నిఘా 2 లో

కులగణన లెక్కలు సవరిస్తాం!

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చేందుకు రెడీ!

బీసీ కులగణన లెక్కలు సవరిస్తాం


ముదిరాజ్‌లకు సీఎం రేవంత్ కీలక హామీ

కులగణనపై కేబినెట్‌లో చర్చ

ముదిరాజ్‌ల డిమాండ్‌పై సీఎం స్పందన

పొన్నం ప్రభాకర్‌కు కీలక బాధ్యతలు

బీసీలకు న్యాయం చేయడమే లక్ష్యం



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణలో బీసీ సామాజికవర్గాలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కులగణనలో తమ కుటుంబాల వివరాలు నమోదు కాలేదని.. జనాభా లెక్కల్లో తేడాలు ఉన్నాయని ఎవరైనా భావిస్తే వాటిని సరిచేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అవసరమైతే బీసీ కులగణన గణాంకాలను సవరించి.. జాబితాలోకి రాని వారి వివరాలను చేర్చుతామని స్పష్టం చేశారు. అదే సమయంలో ముదిరాజ్‌లను ప్రస్తుతం ఉన్న బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించడం కీలకంగా మారింది.

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టడం ద్వారా తమ ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేసిందని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలు జరగలేదని.. ఏడాది వ్యవధిలోనే కులగణన పూర్తి చేసి బీసీ వర్గాల జనాభా వివరాలను నమోదు చేశామని చెప్పారు. కులగణనలో తమ కుటుంబాల వివరాలు నమోదు కాలేదని భావించే వారు సంబంధిత సమాచారాన్ని ప్రభుత్వానికి అందించాలని సీఎం సూచించారు.

ఏ కులానికి చెందిన వారైనా తమ జనాభా లెక్కలు తక్కువగా నమోదు అయ్యాయని భావిస్తే వివరాలతో ముందుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

ఇన్‌స్టాలోకి సోనియా గాంధీ

ఫస్ట్ పోస్ట్ ఇదే!

సోనియా ఖాతాకు భారీ ఫాలోవర్లు

ఆ ముగ్గురినే ఫాలో అవుతున్న సోనియా

ప్రియాంకతో సోనియా సందడి 2 లో

నవంబర్ 10న సోనియా పుస్తకం

పుస్తక వివాదంలో సోనియా సంచలనం

యువతను చేరేందుకు కొత్త అడుగు

సౌదీ మరణశిక్షల వెనుక మిస్టరీ!

భారతీయుడిపై తప్పుడు ప్రచారం

వీడియో తీసి బ్లాక్‌మెయిల్ చేశాడా?

పాక్, బంగ్లా సోషల్ మీడియాలో వైరల్

సౌదీ అధికారుల వాదన ఇదే

జంట కుటుంబాల సంచలన ఆరోపణలు

అరెస్టుల వెనుక అసలేం జరిగింది?

మరణశిక్షపై బంగ్లా ప్రభుత్వం అనుమానాలు

ఘటనపై అధికారిక సమాచారం ఏది?



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): సౌదీ అరేబియాలో బంగ్లాదేశ్‌కు చెందిన నజ్రుల్ ఇస్లాం, స్వీటీ అక్తర్ అనే ఇద్దరికి "మరణశిక్ష" అమలు చేయడం ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. వీరిద్దరు పవిత్ర మక్కా మసీదు ప్రాంగణంలో "అనైతిక చర్యల"లకు పాల్పడటంతో ఉరిశిక్ష అమలు చేసినట్లు సౌదీ అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ శిక్ష అమలు గురించి తమకు సమాచారం లేదని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలనను సౌదీ అరేబియా పంచుకోకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఇదిలా ఉంటే, ఓ భారతీయుడు ఈ ఘటనకు కారణమంటూ పాకిస్తాన్‌కు చెందిన కొన్ని సోషల్ మీడియా అకౌంట్లలో తప్పుడు ప్రచారం మొదలైంది.

రాహుల్, కాంగ్రెస్‌పై 'రెజిమ్ చేంజ్' ఆరోపణలు!

భారత్‌లో ప్రభుత్వ మార్పునకు కుట్ర?

9 దేశాలు.. 101 సంస్థలు.. సంచలన నివేదిక

కాంగ్రెస్‌కు అంతర్జాతీయ సంస్థలతో సంబంధాలా?

నిరసనల వెనుక ఒకే నెట్‌వర్క్? 2 లో

రాహుల్ వియత్నాం పర్యటనపై బీజేపీ ప్రశ్నలు

సోనియా, రాహుల్‌పై బీజేపీ నేతల ఆరోపణలు

ఫాక్స్ న్యూస్ రిపోర్టుతో రాజకీయ దుమారం

వైసీపీ అభ్యర్థులను కిడ్నాప్ చేస్తున్నారు

నామినేషన్లు అడ్డుకుంటున్న టీడీపీ

ప్రజల్లో వైసీపీకి పెరిగిన ఆదరణ 2 లో

కూటమిపై వ్యతిరేకత.. వైసీపీకి అనుకూలత

చంద్రబాబు అరాచకాలను ప్రోత్సహిస్తున్నారు

రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం కూలిపోతుంది

పోలీసులను అడ్డుపెట్టుకుని బెదిరింపులు

అధికార దుర్వినియోగంతో గెలవాలని చూస్తున్నారు

విడుదలైన వెంటనే పోలీసుల పిలుపు!



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): జంతర్ మంతర్ వద్ద అనుమతి లేకుండా నిరసన తెలపడంతో పాటు జాతీయ జెండాను ఎగరవేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' కో-కన్వీనర్లు సౌరవ్ దాస్, అవతోశ్ రంకా విడుదలైన మరుసటి రోజే ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు షాకిచ్చారు.

దేవరగట్టు బన్నీ ఉత్సవంలో రక్తపాతం!



100 మందికి పైగా గాయాలు

కర్రలు, దివిటీలతో భక్తుల బీభత్సం

ఉత్సవంలో విషాదం.. యువకుడు మృతి

దేవరగట్టులో అర్ధరాత్రి కలకలం

రాళ్లు, కర్రలతో పరస్పర దాడులు

ఏటా గాయాలు.. ఈసారి ఒకరు బలి




దసరా జోరు మద్యం హోరు!

- 9 రోజుల్లో రూ.2 వేల కోట్ల అమ్మకాలు
- ఒక్కరోజే రూ.303 కోట్ల విక్రయాలు
- మద్యం అమ్మకాల్లో 37 శాతం వృద్ధి
- బీర్ల విక్రయాల్లో 40 శాతం పెరుగుదల
- 30.37 లక్షల కేసుల బీర్ల అమ్మకం
- ఐఎంఎఫ్ఎల్ విక్రయాల్లోనూ భారీ జోరు
- మూడు రోజుల్లోనే భారీగా పెరిగిన అమ్మకాలు
- దసరా వేళ మద్యం కొనుగోళ్ల సందడి
- ఎక్సైజ్ ఆదాయంపై పెరిగిన ఆసక్తి

న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణలో దసరా పండుగ సీజన్ మద్యం విక్రయాలకు భారీ ఊతమిచ్చింది. అక్టోబర్ నెలలో తొలి 19 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఈసారి విక్రయాల విలువ ఏకంగా 37.02 శాతం పెరగడం గమనార్హం. ముఖ్యంగా దసరా పండుగ సమయంలో మద్యం కొనుగోళ్లు ఊపందుకోవడంతో అమ్మకాల గణాంకాలు భారీగా పెరిగాయి. అక్టోబర్ 19వ తేదీన ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగడం ఈ పెరుగుదలకు నిదర్శనంగా నిలిచింది. 2 లో

పల్లె నుంచి పట్నం బాట



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): దసరా పండుగ సెలవులు ముగియడంతో నగరవాసులంతా తిరిగి హైదరాబాద్ బాట పట్టారు. పండుగ కోసం స్వగ్రామాలకు వెళ్లినవారు తిరిగి నగరానికి చేరుకుంటుండటంతో హైదరాబాద్‌కు దారితీసే ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. మరోవైపు నగరంలోని ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో విధించిన ట్రాఫిక్ ఆంక్షలు వాహనదారులకు ఇబ్బందులు కలిగించాయి. గురువారం తెల్లవారుజాము నుంచే నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ ప్రాంతాల్లో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మరో 30 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం రాదు!

విదేశీ పర్యటనపై రాహుల్‌కు షా చురకలు

ఢిల్లీకి వచ్చాక నా మాట విను

ఆర్నెళ్లకోసారి విదేశాలకు వెళ్లను

రాహుల్‌పై అమిత్ షా ఘాటు వ్యాఖ్యలు

ఓట్ చోరీ ఆరోపణలపై కాంగ్రెస్‌కు కౌంటర్


కాంగ్రెస్ అధికారంలోకి రావడం కష్టమే



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): ఓట్ చోరీ ఆరోపణలు చేస్తున్న ఇండియా కూటమి పార్టీలు ఆందోళనలు చేస్తుంటే, కాంగ్రెస్ ఆ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సెటైర్ వేశారు. 'మీరు ఇప్పుడు విదేశాల్లో ఉన్నారు.. నా మాటలు వినిపించవులే. మీరు ఢిల్లీ వచ్చాక నా మాటలు వినండి. రాబోయే 30 ఏళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదు' అని జోస్యం చెప్పారు. ఇవాళ ఢిల్లీలో యమునా నది ప్రక్షాళన కోసం రూ.8,941 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో అమిత్ షా మాట్లాడారు. 2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 23-10-2026

ఇన్‌స్టాలోకి సోనియా గాంధీ.. ఫస్ట్ పోస్ట్ ఇదే!



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఇన్‌స్టాగ్రామ్‌లోకి అధికారికంగా అడుగుపెట్టారు. గురువారం ఇన్‌స్టాలో ఖాతా తెరిచిన ఆమె, త్వరలో విడుదల కానున్న తన జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' ఫస్ట్ లుక్‌కు సంబంధించిన వీడియోను షేర్ చేశారు. లైబ్రరీలో పుస్తకాల మధ్య కూర్చుని, తన పుస్తకంలోని పేజీలను తిరగేస్తూ, పాత ఫొటోలను చూస్తూ కూతురు ప్రియాంకా గాంధీ వాద్రాతో నవ్వుతూ ముచ్చటిస్తున్న వీడియోను సోనియా గాంధీ పోస్ట్ చేశారు. ఈ క్షణాలను అందరితో పంచుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఇది ప్రేమ, బాధ్యత, నష్టం, మనకంటూ ఒక చోటును వెతుక్కునే కథ అని ఆమె పేర్కొన్నారు.

ఎవరిని ఫాలో అవుతున్నారు?

ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుపెట్టిన కొద్ది గంటల్లోనే ఆమెకు విపరీతమైన ఫాలోవర్లు పెరిగారు. అయితే ఆమె కేవలం ముగ్గురిని మాత్రమే ఫాలో అవుతున్నారు. వారు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కాంగ్రెస్ పార్టీ అధికారిక పేజీ. ఇదిలా ఉంటే.. ఈ పుస్తకంలో ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్, చైనాతో సరిహద్దుకు సంబంధించిన కొన్ని అంశాలను తొలగించాలని పబ్లిషర్ కోరగా, రచయిత్రి సోనియా గాంధీ దానిని తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత మరో పబ్లిషర్ ఈ పుస్తక ప్రచురణ హక్కులను దక్కించుకోగా, నవంబర్ 10న ఈ పుస్తకం మార్కెట్‌లోకి రానుంది. రాజకీయ జీవితంలో సోషల్ మీడియాకు చాలాకాలం దూరంగా ఉన్న సోనియా గాంధీ, నేటి యువతను, ఓటర్లను చేరుకునేందుకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ అడుగువేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కులగణన లెక్కలు సవరిస్తాం!

మొదటి పేజీ తరువాయి

వాటిని పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ అంశాన్ని తదుపరి కేబినెట్ సమావేశంలో చర్చించి.. లెక్కలను మరింత పక్కాగా చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం అందించాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని రేవంత్ రెడ్డి చెప్పారు. అవకాశం ఉంటే తన చుట్టూ బలహీనవర్గాల ప్రజలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని వ్యాఖ్యానించారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చుతారా?

ముదిరాజ్ సామాజికవర్గాన్ని ప్రస్తుతం ఉన్న బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పై ముఖ్యమంత్రి స్పందించారు. ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. బీసీ-ఏలో చేర్చేందుకు ఉన్న చట్టపరమైన అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో గంగపుత్రుల వర్గంలో ఉన్న అభ్యంతరాలు, అపోహలను కూడా తెలుసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ముదిరాజ్‌లకు న్యాయం జరిగేలా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యత అప్పగించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ అంశంపై కేబినెట్‌లో చర్చించడంతో పాటు.. అవసరమైన తదుపరి చర్యలను పరిశీలిస్తామని వెల్లడించారు. అయితే ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చే అంశంపై తుది నిర్ణయం తీసుకున్నట్లు సీఎం ప్రకటించలేదు. దీనికి సంబంధించిన న్యాయపరమైన, పరిపాలనాపరమైన అంశాల పరిశీలన కీలకం కానుంది.

ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి తమ ప్రభుత్వం ఇప్పటికే రాజకీయ, ఇతర అవకాశాలు కల్పించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. మరికొందరు నాయకులకు కూడా త్వరలో తగిన అవకాశాలు వస్తాయని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మంత్రి వాకిటి శ్రీహరికి రాజకీయంగా అవకాశం కల్పించానని గుర్తుచేశారు. కొడంగల్ నియోజకవర్గంలో ముదిరాజ్‌ల జనాభా ఎక్కువగా ఉందని.. గతంలో వారు తనకు అందించిన సహకారాన్ని మరచిపోనని పేర్కొన్నారు.

తన పనితీరుపై మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి.. పరోక్షంగా గత ప్రభుత్వ నాయకత్వంపై విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని.. తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే తమ ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, రైతులకు ఆర్థిక సాయం వంటి పథకాలను ప్రస్తావించారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన ప్రజా ఉపయోగ కార్యక్రమాలను నిలిపివేయకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు. బలహీనవర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి అభివృద్ధికి తోడ్పడటం తమ ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

పండుగ సాయన్న పోరాటాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. భూస్వాములు, జమీందార్ల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి పేదలకు అండగా నిలిచిన వ్యక్తిగా ఆయనను కొనియాడారు. దొరలు ఆక్రమించిన భూములను పేదలకు అందించేందుకు సాయన్న పోరాటం చేశారని పేర్కొన్నారు. శతాబ్దం గడిచినా ప్రజలు ఆయనను గుర్తుంచుకోవడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో దొడ్డి కొమురయ్యతో పాటు పండుగ సాయన్న విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ చరిత్రలో ప్రజల కోసం పోరాడిన మహనీయుల సేవలను గుర్తించి, భవిష్యత్ తరాలకు పరిచయం చేయడం అవసరమని పేర్కొన్నారు.

దసరా జోరు.. మద్యం హోరు!

మొదటి పేజీ తరువాయి

19 రోజుల్లోనే రూ.2 వేల కోట్లు దాటిన అమ్మకాలు: తెలంగాణ ఎక్సైజ్ శాఖ గణాంకాల ప్రకారం.. అక్టోబర్ 1 నుంచి 19వ తేదీ వరకు మద్యం విక్రయాల విలువ రూ.2,054.51 కోట్లకు చేరుకుంది. అక్టోబర్ 16వ తేదీ నాటికి రూ.1,527.85 కోట్లుగా ఉన్న అమ్మకాలు.. కేవలం మూడు రోజుల్లోనే భారీగా పెరిగి రూ.2 వేల కోట్ల మార్కును దాటాయి. పండుగ వాతావరణం, సెలవుల నేపథ్యంలో కొనుగోళ్లు పెరగడం ఈ గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 37.02 శాతం వృద్ధి నమోదవడం మద్యం వ్యాపారంలో పెరిగిన లావాదేవీలను సూచిస్తోంది.

బీర్ల అమ్మకాల్లో భారీ పెరుగుదల: ఈసారి మద్యం విక్రయాల్లో బీర్ల అమ్మకాలు ప్రత్యేకంగా నిలిచాయి. అక్టోబర్ 1 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 30.37 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే కాలంలో 21.55 లక్షల కేసుల బీర్ల విక్రయాలు మాత్రమే నమోదయ్యాయి. అంటే ఈసారి అదనంగా 8.82 లక్షల కేసుల బీర్లు విక్రయమయ్యాయి. దీంతో బీర్ల అమ్మకాల్లో 40.93 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం మద్యం విక్రయాల పెరుగుదలలో బీర్ల వాటా కీలకంగా కనిపిస్తోంది.

ఐఎంఎఫ్ఎల్ విక్రయాలూ జోరే: బీర్లతోపాటు ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) విక్రయాలు కూడా గణనీయంగా పెరిగాయి. గతేడాది అక్టోబర్ 1 నుంచి 19వ తేదీ వరకు 14.16 లక్షల కేసులుగా ఉన్న విక్రయాలు.. ఈసారి 18.38 లక్షల కేసులకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే 4.22 లక్షల కేసులు అదనంగా అమ్ముడయ్యాయి. ఈ విభాగంలో 29.80 శాతం వృద్ధి నమోదైంది. బీర్లు, ఐఎంఎఫ్ఎల్ రెండింటి అమ్మకాలు పెరగడంతో రాష్ట్రవ్యాప్తంగా మద్యం వ్యాపారం పండుగ సీజన్‌లో మరింత ఊపందుకుంది.

ఒక్కరోజే రూ.303.40 కోట్ల విక్రయాలు: అక్టోబర్ 19వ తేదీన నమోదైన అమ్మకాలు ఈసారి ప్రత్యేకంగా చర్చనీయాంశమయ్యాయి. ఆ ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాది ఇదే రోజుతో పోలిస్తే అమ్మకాల విలువలో 801.90 శాతం వృద్ధి నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పండుగ సందర్భంగా ఒకే రోజులో ఈ స్థాయిలో విక్రయాలు జరగడం మద్యం వ్యాపారంలో కనిపించిన అసాధారణ పెరుగుదలను సూచిస్తోంది.

ప్రభుత్వ ఆదాయంపై ఆసక్తి: తెలంగాణ ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ ఆదాయం సమకూర్చే కీలక విభాగాల్లో ఒకటి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మద్యం విక్రయాలు పెరిగినప్పుడు ప్రభుత్వానికి సమకూరే ఆదాయంపైనా ఆసక్తి పెరుగుతుంది. అక్టోబర్ తొలి 19 రోజుల్లోనే రూ.2 వేల కోట్లకు పైగా అమ్మకాలు నమోదవడం, బీర్లతోపాటు ఇతర మద్యం రకాల విక్రయాలు కూడా పెరగడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ గణాంకాలు విక్రయాల విలువను సూచిస్తాయి; ప్రభుత్వానికి వచ్చిన నికర ఆదాయం ఎంతన్నది వేరుగా పరిగణించాలి.

విడుదలైన వెంటనే పోలీసుల పిలుపు!

మొదటి పేజీ తరువాయి

ఈ కేసులో విచారణకు హాజరుకావాలని అశుతోశ్, సౌరవ్‌కు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సమన్లు జారీ చేశారు. వీరితో పాటు సీజేపీ జాతీయ సంస్థాగత వ్యవహారాల ఇన్ చార్జిగా నియమించబడ్డ అజింక్య షిండేకు సైతం నోటీసులు ఇచ్చారు. గురవారం మధ్యాహ్నం 12 గంటలకు రాజౌరీ గార్డెన్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు.

రెండు కేసులో క్రైమ్ బ్రాంచ్ కే:

కాగా జంతర్ మంతర్ వద్ద నిరసనకు సంబంధించి సీజేపీ నేతలపై నమోదైన రెండు కేసులను ఈ వారంలో ఢిల్లీ పోలీసులు క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఆ సమయంలో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ అక్టోబర్ 13న సీజేపీ సభ్యులు జంతర్ మంతర్ వద్ద నిరసనకు యత్నించారు. అయితే, జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో వారు ప్రైవేటు స్థలంలోకి చొరబడి అక్కడి నుంచి నిరసన ప్రదేశానికి చేరుకున్నారని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసులు నమోదు చేశారు. ఈ కేసులో అక్టోబర్ 14న అరెస్టయిన సౌరవ్ దాస్, అశుతోశ్ రంకా తిహార్ జైలు నుంచి నిన్నే విడుదలయ్యారు. ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున పూచీకత్తులు, శాంతి భద్రతలను కాపాడతామనే లిఖితపూర్వక అండర్‌టేకింగ్స్ ఆధారంగా మెజిస్ట్రేట్ వారికి బెయిల్ మంజూరు చేశారు.

రిలీజైన మరుసటి రోజే విచారణ:

అయితే విడుదలైన మరుసటి రోజే క్రైమ్ బ్రాంచ్ నుంచి సమన్లు రావడంతో సీజేపీ నేతలకు షాకింగ్ గా మారింది. మొన్నటి అరెస్టులో బెయిల్ సందర్భంగా కోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇటువంటి పరిస్థితుల్లో క్రైమ్ బ్రాంచ్ ప్రారంభించిన విచారణ సీజేపీ ఉద్యమాన్ని ఎలాంటి మలుపుకు కారణం అవుతుంది అనేది వేచి చూడాలి.

దేవరగట్టు బన్నీ ఉత్సవంలో రక్తపాతం!



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో నిర్వహించిన కర్రల సంబరం రణరంగాన్ని తలపించింది. బుధవారం రాత్రి నిర్వహించిన దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు సందర్భంగా హింస చెలరేగింది. తొలుత మాళ మల్లేశఅవరస్వామి కల్యాణోత్సవంమ నిర్వహించారు. అనంతరం కొండపై నుంచి ఉత్సవమూర్తులను తీసుకుని దిగువనున్న సింహాసనం కట్ట వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించి బన్నీ జైత్రయాత్ర ప్రారంభించారు. ఉత్సవ మూర్తుల కోసం వివిధ గ్రామల ప్రజలు కర్రలు, దివిటీలు తిప్పారు. ఈ క్రమంలో అర్ధరాత్రి దాటాక ఊరేగింపులో హింస చెలరేగింది. కర్రలు, దివిటీలు తిప్పే క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. గ్రామస్తులు పరస్పరం రాళ్లు, కర్రలు, దివిటీలతో తలపడటంతో 100 మందికిపైగా తీవ్రంగా గాయపడగా ఈ ఘటనలో ఆలూరుకు చెందిన పోతురాజు (28) అనే వ్యక్తి మృతి చెందాడు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా విజయదశమి పురస్కరించుకుని బన్ని ఉత్సవాన్ని ప్రతియేటా ఇక్కడ నిర్వహిస్తారు. దేవరగట్టు పరిసరాల్లోని దాదాపు 15 గ్రామాల భక్తులు ఈవేడుకల్లో పాల్గొంటారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా భక్తులు గాయాలపాలయ్యారు.

టీవీ ఛానెళ్లకు కేంద్రం వార్నింగ్!



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): దేశంలోని ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానళ్లకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కీలక సూచనలు జారీ చేసింది. కార్యక్రమాల ప్రసారంలో కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ (రెగ్యులేషన్) చట్టం-1995 కింద నిర్దేశించిన ప్రోగ్రామ్ కోడ్‌ను కచ్చితంగా పాటించాలని హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు టీవీ ఛానెళ్లు మరింత బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ విధానాన్ని పాటించాలని సూచిస్తూ పలు ఆదేశాలు జారీ చేసింది.

మతాల విషయంలో కేర్‌ఫుల్

వార్తల ప్రసారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లను ప్రత్యక్ష ప్రసారం చేయకూడదని సూచించింది. హింసాత్మక దృశ్యాలను ప్రసారం చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, లైంగిక నేరాల బాధితుల గుర్తింపును బయటపెట్టకూడదని ఆదేశించింది. భారతదేశానికి సంబంధించిన మ్యాప్‌లను ప్రసారం చేసేటప్పుడు ప్రామాణికమైన మ్యాప్‌లనే ఉపయోగించాలని మంత్రిత్వ శాఖ సూచించింది. మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టే లేదా దేశ వ్యతిరేక భావాలను ప్రోత్సహించే కంటెంట్ ప్రసారం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది.


జర్నలిజం ప్రమాణాలను పాటించాలి:

అలాగే వార్తలు, కార్యక్రమాల తయారీలో కృత్రిమ మేధ సాధనాలను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రసారమయ్యే కంటెంట్ విశ్వసనీయతను నిర్ధారించేందుకు ఎడిటోరియల్ పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని పేర్కొంది. ఈ మార్గదర్శకాల ద్వారా టీవీ ఛానళ్లు బాధ్యతాయుతమైన జర్నలిజం ప్రమాణాలను పాటించాలని కేంద్రం స్పష్టం చేసింది. టెలివిజన్ ప్రసారాల నాణ్యత, సామాజిక బాధ్యత మరియు దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రసార సంస్థలు ఈ మార్గదర్శకాలను తక్షణమే అమలు చేయాలని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

పల్లె నుంచి పట్నం బాట..

మొదటి పేజీ తరువాయి

నగరంలోకి ఆర్టీసీ బస్సుల రాకపోకలపై ఆంక్షలు విధించడంతో కొన్ని బస్సులు దిల్‌సుఖ్‌నగర్ వద్దే నిలిచిపోయాయి. దీంతో బస్సుల్లో ప్రయాణిస్తున్నవారు ప్రత్యామ్నాయ మార్గాల కోసం మెట్రో స్టేషన్లకు చేరుకున్నారు. ఫలితంగా మెట్రో స్టేషన్లలోనూ రద్దీ పెరిగింది.



ట్యాంక్‌బండ్ వైపు ట్రాఫిక్ మళ్లింపు:

దుర్గామాత విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే సాధారణ వాహనాలను తెలంగాణ తల్లి ఫ్లైఓవర్, లోయర్ ట్యాంక్‌బండ్ మీదుగా మళ్లిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అయితే పండుగ సెలవుల నుంచి తిరిగి వస్తున్న ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలు మందకొడిగా సాగాయి.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. సెలవులు ముగియడంతో శుక్రవారం నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. మరోవైపు జూనియర్ కళాశాలలు గురువారం నుంచే పునఃప్రారంభమయ్యాయి. దీంతో సెలవుల కోసం సొంతూళ్లకు వెళ్లిన విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఒకవైపు పండుగ సెలవుల అనంతరం నగరానికి చేరుకుంటున్న ప్రయాణికులు, మరోవైపు విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండటంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. ఉదయం వేళ ప్రయాణాలు చేసే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మరో 30 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం రాదు!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ వియత్నామ్ పర్యటనను ప్రస్తావిస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఆర్నెళ్లకోసారి విదేశాలకు వెళ్లను..

రాహుల్ గాంధీని ఉద్దేశించి.. మీరు విదేశాల్లో ఎక్కడో కూర్చుని ఉన్నారు. ఎందుకు వెళ్లారో కూడా చెప్పరు. అది మీ వ్యక్తిగత విషయం. దానిపై నేను విమర్శించను. కానీ ఒకసారి మీరు ఢిల్లీలో ల్యాండ్ అయ్యాక నా మాట వినండి.. మరో మూడు దశాబ్దాల వరకు ఈ దేశంలో మీ వంతు (అధికారం) రాదు అని ఎద్దేవా చేశారు. ప్రతి ఆరు నెలలకోసారి విదేశాలకు వెళ్లాల్సిన వ్యక్తిలా కాకుండా.. నేను ఇక్కడే పుట్టాను, ఇక్కడే జీవిస్తున్నాను, ఇక్కడే చనిపోతాను దని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పాత్రపై ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నిరసనలు చేపడుతున్నాయి. ఈ ఆరోపణలను ప్రస్తావిస్తూ అమిత్ షా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో 54 ఏళ్లుగా, అరుణాచల్ ప్రదేశ్‌లో 12 ఏళ్లుగా, ఢిల్లీలో 18 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని ఆయన పేర్కొన్నారు. బీజేపీ మరో 30 ఏళ్ల అధికారంలో ఉంటుందని తాను చెబితే, ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

వైసీపీ అభ్యర్థులను కిడ్నాప్ చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): ఏపీ లోకల్ బాడీ ఎన్నికల్లో విచిత్ర పరిణామాలు జరుగుతున్నాయని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అవాంఛనీయ సంఘటనలు 19 చోట్ల జరిగాయన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తాత్కాలికంగా ఎన్నికలను నిలిపివేశారని.. మొత్తం స్థానాల్లో నిలుపుదల చేయలేదన్నారు. సుప్రీంకోర్టు స్పందించడం వల్లే ఎన్నికల కమీషన్, పోలీసులు తమ వైఖరి మార్చుకున్నారని తెలిపారు. ప్రజల్లో కూటమి పట్ల వ్యతిరేకత పెరిగి.. వైసీపీకి అనుకూలత పెరిగిందన్నారు. అందుకే చంద్రబాబు అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.

సాయికృష్ణ లాకప్ డెత్ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే రూ. 25 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు తమ తప్పులను సరిచేసుకోవాలని సూచించారు. తప్పులు చేసిన ఏ అధికారినీ వైసీపీ ప్రభుత్వం వదిలిపెట్టదని.. కోర్టు ముందు నిలబెడుతుందన్నారు. ఎన్నో చోట్ల నామినేషన్లు వేయకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని కూటమి నాయకులు బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. గుంటూరులో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు. రెండున్నర ఏళ్లలో కూటమి ప్రభుత్వం కూలిపోతుందని.. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గుంటూరులో 76 స్థానాల్లో వైసీపీ పోటీ చేస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. జిల్లా పరిషత్, ఎంపీటీసీ ఎన్నికల్లో నామినేషన్లు వేయనీయకుండా పల్నాడులో వైసీపీ అభ్యర్థులను కిడ్నాప్ చేస్తున్నారని.. దీనిపై కూడా వైసీపీ కోర్టును ఆశ్రయిస్తుందని చెప్పారు. వ్యవస్తలన్నీ చంద్రబాబు గుప్పెట్లో పెట్టుకుని గెలుపొందాలని చూస్తున్నారని ఆరోపించారు.

రాహుల్, కాంగ్రెస్‌పై 'రెజిమ్ చేంజ్' ఆరోపణలు!



న్యూస్ డెస్క్, 22 అక్టోబర్ (ఇది కద నిజం): ఫాక్స్ న్యూస్ నివేదిక దేశ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. ఫ్రాన్స్ అల్లర్లు, భారతదేశంలో నిరసనల వెనక ఒకే నెట్‌వర్క్ ఉందని ఫాక్స్ న్యూస్ సంచలన దర్యాప్తు నివేదిక పేర్కొంది. 9 దేశాల్లో 101 సంస్థలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, ఇవన్నీ నిరసనలకు మద్దతు ఇవ్వడం, వాటిని నిర్వహించడం, ప్రచారం చేయడంలో భాగస్వాములు అవుతున్నాయకని నివేదిక ఆరోపించింది. సీనియర్ ఎడిటర్ అజ్రా నోమానీ రూపొందించిన 'Global Chaos Inc Grows to 101 Groups' అనే నివేదికలో ఈ నెట్‌వర్క్‌ను "రెడ్-గ్రీన్ ప్రొటెక్ట్ ఎకోసిస్టమ్"గా అభివర్ణించారు.

ఈ నివేదిక వెలువడిన తర్వాత అధికార బీజేపీ ప్రతిపక్షాలపై తీవ్ర ఆరోపణలు చేస్తోంది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, నివేదికలో పేరున్న వ్యాపారవేత్త నెవిల్లే రాయ్ సింగమ్‌కు మధ్య సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఆరోపించారు. భారతదేశంలో ప్రభుత్వాన్ని మార్చే లక్ష్యంతో అంతర్జాతీయ స్థాయిలో కుట్ర జరుగుతోందని ఆరోపించారు. దీనిని రెజిమ్ చేంజ్ ఆపరేషన్‌గా ఆయన అభివర్ణించారు. ఎక్స్ వేదికగా ఆయన ఈ ఆరోపణలు చేశారు. గురువార మీడియా సమావేశంలో అన్ని వివరాలను వెల్లడిస్తానని చెప్పారు.

మరోవైపు, బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ కూడా రిపోర్టులో పేర్కొన్న ప్రొగ్రెసివ్ ఇంటర్నేషనల్ అనే అంతర్జాతీయ సంస్థపై ఆరోపణలు చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ 10 జన్‌పథ్‌లో ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులను కలిశారని కూడా భండారీ ఆరోపించారు. భారత్‌లో నిరసనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకత్వం ఆ సంస్థతో సంప్రదింపులు జరిపిందా, అలాంటి సంబంధాలు రాజకీయ సందేశాలపై ప్రభావం చూపాయా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ వియత్నాం పర్యటనను కూడా భండారీ ప్రశ్నించారు. నవంబర్ 1న నిరసనకు ముందు అంతర్జాతీయ సంస్థల సూచనలు తీసుకునేందుకు వెళ్లారా? అని ప్రశ్నించారు.

సౌదీ మరణశిక్షల వెనుక మిస్టరీ!

మొదటి పేజీ తరువాయి

ఇదే కథనాన్ని బంగ్లాదేశ్, పాకిస్తాన్‌తో పాటు ఇతర దేశాలకు చెందిన సోషల్ మీడియా అకౌంట్లు ప్రచారం చేశాయి. అయితే, ఈ ఆరోపణలకు మద్దతుగా ఎలాంటి అధికారిక సమాచారం లేదు.

భారతీయుడు ఈ చర్యను వీడియో తీశాడా.?

అక్టోబర్ 20 నుంచి ఈ ప్రచారం మొదలైంది. మక్కాలోని మస్జిద్ అల్ హరామ్‌లో క్లీనర్లుగా పనిచేసిన నజ్రుల్, స్వీటీ మధ్య ప్రేమ బంధం ఏర్పడిందనే ఆరోపణలు ఉన్నాయి. మసీదులోని 85,87 గేట్ల మధ్య ఉన్న ఏకాంత గదిలో ఇద్దరు కలిసి అనైతిక చర్యకు పాల్పడుతున్న సమయంలో నజ్రుల్ తన భారతీయ స్నేహితుడిని బయట కాపలాగా ఉంచాడని, ఆ వ్యక్తి వారి వీడియో తీశాడని సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది.

ఆ తర్వాత స్వీటీని బ్లాక్‌మెయిల్ చేయడంలో విఫలమైన భారత వ్యక్తి ఈ వీడియోను అధికారులకు పంపించాడనే ప్రచారం ఉంది. సౌదీ అధికారులు ముగ్గురిని అరెస్ట్ చేసి, భారతీయ వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించగా, నజ్రుల్, స్వీటీకు మరణశిక్ష అమలు చేశారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

పాకిస్తాన్ సోషల్ మీడియా అకౌంట్లలో ప్రచారం..

ఈ ఆరోపణలు ముందుగా పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన కొన్ని ఫేస్‌బుక్, ఎక్స్ అకౌంట్లలో వెలుగులోకి వచ్చాయి. సౌదీలోని రియాద్‌లో పాకిస్తాన్

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 23-10-2026

యాదగిరిగుట్టలో మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన సదస్సు



ఇది కద నిజం ,యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 22: యాదగిరిగుట్టలోని కళ్యాణకట్ట ప్రాంగణంలో మహిళలు మరియు చిన్నారుల భద్రతపై ఒక ప్రత్యేక అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులకు, స్థానికులకు రక్షణ చర్యలపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా మహిళల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వివరించారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా ప్రయాణించే సమయంలో తమ ప్రయాణ వివరాలను కుటుంబ సభ్యులకు లేదా నమ్మకమైన వ్యక్తులతో పంచుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో నిర్మానుష్య ప్రాంతాలను వీలైనంత వరకు నివారించాలని, స్వీయ రక్షణ పద్ధతులు నేర్చుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే అత్యవసర ఫోన్ నంబర్లను ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని, వేధింపులు, హింస లేదా అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగిస్తూ వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. చిన్నారుల భద్రత కోసం తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు కీలక సూచనలు జేశారు. మంచి స్పర్శ , చెడు స్పర్శ గురించిన అవగాహనను చిన్నారులకు చిన్న వయస్సు నుంచే కల్పించాలని తెలిపారు. ఏదైనా అసౌకర్యం లేదా భయం కలిగితే వెంటనే తల్లిదండ్రులకు లేదా నమ్మకమైన పెద్దలకు చెప్పాలని పిల్లలను ప్రోత్సహించాలని చెప్పారు. అపరిచితులతో ఎక్కడికీ వెళ్లకూడదని, వారి నుండి బహుమతులు లేదా ఆహారం తీసుకోకూడదని పిల్లలకు నేర్పించాలని కోరారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను పర్యవేక్షించి సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలో వారికి ముందే తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు భాజా మొయినుదిన్ మరియు పోలీస్ సిబ్బందితో పాటు భారీ సంఖ్యలో యాత్రికులు, భక్తులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో విషాదం

పుష్కరిణిలో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి



ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 22: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పుష్కరిణిలో ప్రమాదవశాత్తు నీట మునిగి నాలుగేళ్ల చిన్నారి మృతి చెందిన హృదయవిదారక ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా బడంగ్ పేట్ పరిధిలోని సరూర్ నగర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి అక్టోబర్ 21వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనార్థం విచ్చేశారు. దర్శనానికి ముందు కుటుంబ సభ్యులు కళ్యాణకట్ట దగ్గరి పుష్కరిణిలో స్నానాలు చేస్తుండగా, ప్రవీణ్ కుమార్ చిన్న కూతురైన శివలింగం ఆధ్యత (04) పుష్కరిణి మెట్ల వద్ద ఆడుకుంటున్నది. ఈ క్రమంలో చిన్నారి ఆధ్యత ప్రమాదవశాత్తు కాలుజారి పుష్కరిణిలో పడిపోయింది. పాపకు ఈత రాకపోవడంతో నీటిలో ఊపిరాడక మునిగిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో తక్షణమే పాపను నీటి నుండి బయటకు తీసి అత్యవసర చికిత్స నిమిత్తం బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పట్నుంచీ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 08:32 నిమిషాలకు పాప తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాదగిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తండ్రికి అప్పగించారు. ప్రస్తుతం యాదగిరిగుట్ట పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నూతన సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి రామిరెడ్డికి ఘన సన్మానం



ఇది కద నిజం, ఉమ్మడి జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం చిల్లరి సొసైటీ చైర్మన్ గా నూతన ఎన్నికైన ధర్మారెడ్డి రామిరెడ్డిని గౌరారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జూపాల శంకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ గుప్తా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరారం తండా సర్పంచ్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

బిజెపి ఎంపీటీసీ అభ్యర్థి గా రేలంగి ఆంజనేయులు నామినేషన్



కొత్తపేట (ఇది కద నిజం)అక్టోబర్ 22 : బిజెపి ఎంపీటీసీ కొత్తపేట 1 లో నామినేషన్ వేసిన కొత్తపేట మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు రేలంగి ఆంజనేయులు, బిజెపి నియోజకవర్గ ఇంచార్జి పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో బయలుదేరి నామినేషన్ దాఖలు చేశారు. సత్యానందం మాట్లాడుతు బిజెపి అధిష్టానం పిలుపుమేరకు సమర్థవంతమైన అభ్యర్థి కొత్తపేట 1 లో ఎంపీటీసీ అభ్యర్థి గా నామినేషన్ వేయించడం జరిగింది. కూటమి అభ్యర్థి గా భారీ మెజారిటీ తో విజయం సాధిస్తాం అని ధీమా వ్యక్తం చేశారు.ఈ నామినేషన్ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శి కోటిపల్లి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర యువ మోర్చా నాయకులు పాలూరి జయ ప్రకాష్ నారాయణ, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు కోటిపల్లి దామోదర్, సిద్ధంశెట్టి గంగారావు, మండల కార్యదర్శి సిద్ధంశెట్టి శంకర్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు చోడపనీడి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహుడి లక్ష పుష్పార్చన



ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి జిల్లా: పవిత్ర ఏకాదశి పర్వదినం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయంలో లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టిన ఈ పూజా కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రధానాలయంలోని ముఖమండపంలో నయన మనోహరంగా అలంకరించిన ఉత్సవ మూర్తులకు వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సహస్రనామాలతో లక్ష పుష్పార్చన అత్యంత వైభవంగా చేపట్టారు. వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలతో నిర్వహించిన ఈ అర్చన కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు లక్ష పుష్పార్చన విశిష్టతను భక్తులకు వివరించారు. ఏకాదశి పర్వదినాన స్వామివారిని పూజిస్తే సకల పాపాలు తొలగిపోతాయని తెలిపారు.

గులాబీ గూటికి చింతలగడ్డ తండా యువత

- జోరుగా యువత, గులాబీ పార్టీలోకి చేరికలు.
- పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన మాజీ చైర్మన్ నవీన్ రావు



ఇది కద నిజం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

మరిపెడ మండలం,చింతల గడ్డ తండా నుంచి కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన 35 కుటుంబాలకు చెందిన పార్టీ సీనియర్ నాయకులకు కండువా కప్పి బీఆర్ స్ పార్టీలోకి ఆహ్వానించిన.. మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, ఈ చేరికల సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ పాలన లోనే అన్ని వర్గాలప్రజలు సంతోషంగా ఉన్నారు అని తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో కళ్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని అన్ని కులాల, వర్గాల ప్రజలకు హామీలు ఇచ్చి ఓట్లు దండుకుందని విమర్శించారు. అధికారం లోకి వచ్చిన తర్వాత ఆ హామీలను బూడిదలో పోసిన పన్నీరులా మార్చి, పేద కుటుంబాలను నట్టేట ముంచుతూ తీవ్రంగా మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మాటలను నమ్మి మోసపోయామని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు, వ్యవసాయ రంగానికి సాగునీరు అందించలేని దౌర్భాగ పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది అన్నారు, కరెంటు సమస్యతో రైతులు అల్లాడిపోతున్నారన్నారు ఇవన్నీ చూసి ప్రజలు కేసీఆర్ పాలనే కోరుకుంటున్నారని తెలిపారు. వచ్చే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో యువకులు మేధావులు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. మన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మండల ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షులు అజ్మీరా రెడ్డి, గంధసిరి కృష్ణ గౌడ్, అంగోత్ ధర్మ, రాంచంద్, శ్రీను, రమేష్, బీచ్చు, గణేష్, నాగేష్, నాగేశ్వర్, రాజేందర్, సోమన్న, కళ్యాణ్, సాయి, అశోక్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.







పిట్లం సొసైటీ నూతన చైర్మన్‌గా ధర్మారెడ్డి రాంరెడ్డి ప్రమాణస్వీకారం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో సొసైటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్‌గా ధర్మారెడ్డి రాంరెడ్డి, నూతన డైరెక్టర్లుగా కుమ్మరి యాదమ్మ, కుమ్మరి ఈశ్వర్‌తో పాటు పలువురు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షునికి ఘన సన్మానం



ఇది కద నిజం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

తెలంగాణ రక్షణ సేన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా గశేధసిరి వేణు గౌడ్ నియామకం సందర్భంగా జిల్లా ఐక్య గౌడ సంఘాల ఆధ్వర్యంలో వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన రాష్ట్ర ఏర్పాటు అనంతరం తెలంగాణ జాగృతి కార్యక్రమాల్లోను భాగస్వాములయ్యారు.తగిన కష్టానికి మంచి గుర్తింపు వచ్చింది అని పలువురు నాయకులు గుర్తుచేశారు.

ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులు గశేధసీరి వేణు గౌడ్ ను జిల్లా గౌడ సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుని సారథ్యంలో జిల్లాలో పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.సమస్యలను పరిష్కరించడంలో,యువతను రాజకీయ,సామాజిక సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో నూతన అధ్యక్షుడిగా మీ పాత్ర పోషించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐక్య గౌడ సంఘాల అధ్యక్షుడు జెర్రీ పోతుల వెంకన్న గౌడ్,తెలంగాణ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకన్న గౌడ్,తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్ గౌడ్, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్, జై గౌడ జిల్లా అధ్యక్షుడు గుదే వీరన్న గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గద్దం సమ్మయ్య గౌడ్,గండు మురళీ,డా: గూగులోత్ దేవోజీ, అశ్విన్,వీరన్న నాయక్, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గండి సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సొసైటీ డైరెక్టర్లకు శాలివాహన సంఘం ఘన సన్మానం



ఇది కదా నిజం, నిజాంబాద్ జిల్లా పిట్లం: నూతన చిల్లర్గి సొసైటీ డైరెక్టర్లుగా ఎన్నికైన కుమ్మరి యాదమ్మ, కుమ్మరి ఈశ్వర్‌లను పిట్లంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం ప్రతినిధులు కుమ్మరి చిన్న రాములు, కుమ్మరి శంకర్, పుష్పలత, అనసూయ పెంటవ సునీత, జితేందర్, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఎపి సిఎస్ సాయి ప్రసాద్ పదవీకాలం మరో 6 మాసాలు పొడిగింపు.



అమరావతి,ఇది కద నిజం ,అక్టోబరు 22:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఆరు మాసాలు పొడిగించింది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వ సిబ్బంది,ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల మంత్రిత్వ శాఖ, సిబ్బంది మరియు శిక్షణ విభాగం (డిఓపిటి) ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు కేంద్రం సిఎస్ పదవీ కాలాన్ని మరోసారి ఆరు మాసాలకు అనగా 2027 మే 31 వరకూ పొడిగిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరి రాజేశ్ కుమార్ యాదవ్ రాష్ట్ర సాధారణ పరిపాలన(పొలిటికల్)శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ ద్వారా తెలియ జేశారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన జి.సాయి ప్రసాద్ ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తుండగా ఇప్పటికే గత జూన్ 1 నుండి నవంబరు 30 వరకూ 6 మాసాలు ఆయన పదవీ కాలాన్ని పొడిగించగా వచ్చే నెల30వ తేదీన ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది.అయితే సిఎస్ పదవీ కాలాన్ని మరోసారి పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29న కేంద్ర ప్రభుత్వానికి డిఓ లేఖ వ్రాయగా అందుకను గుణంగా కేంద్రం ప్రభుత్వం ఆమోదించి సిఎస్ సాయి ప్రసాద్ పదవీ కాలాన్నిమరో ఆరు మాసాలు అనగా 2027 మే 31 వరకూ పొడిగిస్తూ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 23-10-2026

సినిమా న్యూస్

పెళ్లికి రెడీ అయిన 'హనుమాన్' హీరో!



ఉదయ్‌పూర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్! టాలీవుడ్ యంగ్ హీరో, 'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ వార్తను స్వయంగా ఆయనే ధృవీకరించారు. తన పెళ్లికి సంబంధించిన ఆసక్తికర విషయాలను అభిమానులతో పంచుకున్నారు. రాజస్థాన్‌లోని చారిత్రాత్మక నగరమైన ఉదయ్‌పూర్‌లో ఈ ఏడాది డిసెంబర్‌లో తన వివాహం అత్యంత నిరాడంబరంగా జరగనుందని తేజ సజ్జ వెల్లడించారు.

ఈ వివాహం పూర్తిగా పెద్దలు కుదిర్చిన వివాహం అని తేజ స్పష్టం చేశారు. తన తల్లిదండ్రులే ఈ సంబంధం నిశ్చయించారని తెలిపారు. డిసెంబర్‌లో జరగబోయే పెళ్లి వేడుకకు ముందు, నవంబర్ నెలలో నిశ్చితార్థ వేడుకను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ మీడియా కంటికి దూరంగా, అత్యంత గోప్యంగా ఉంచాలని కోరుకునే తేజ సజ్జ.. ఈ పెళ్లి వేడుకను కూడా కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలోనే జరపాలని నిర్ణయించుకున్నారు. ఉదయ్‌పూర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ ముగిసిన తర్వాత, హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు, స్నేహితుల కోసం ప్రత్యేకంగా ఒక ఘనమైన రిసెప్షన్ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఇక తన కాబోయే భార్య గురించి చెబుతూ.. ఆమెకు సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధం లేదని తేజ వెల్లడించారు. ఆమె కుటుంబం టెక్నాలజీ రంగంలో వ్యాపారం చేస్తోందని, ఆమె కూడా తన తండ్రితో కలిసి అదే రంగంలో పనిచేస్తున్నారని చెప్పారు. ఆమె అమెరికాలో పెరిగారని, సినిమా గ్లామర్ ప్రపంచానికి, లైమ్‌లైట్‌కు పూర్తిగా దూరంగా ఉన్నారని తెలిపారు. సెలబ్రిటీ ప్రపంచానికి దూరంగా ఉండే ఆమె స్వభావమే తనకు బాగా నచ్చిందని, భవిష్యత్తులో కూడా ఆమె ప్రైవసీకి ఎటువంటి భంగం కలగకుండా చూసుకుంటానని తేజ సజ్జ పేర్కొన్నారు.

ప్రొఫెషనల్ లైఫ్ విషయానికి వస్తే.. 'హనుమాన్' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జ, ఆ తర్వాత 'మిరాయ్' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ప్రముఖ రియాలిటీ షో 'ది ట్రైటర్స్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్ వ్యవహరిస్తూ బిజీగా ఉన్నారు.


'చంద్రయాన్' రిలీజ్‌పై ఉత్కంఠ!

రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. 'చంద్రయాన్' అనే టైటిల్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ఇప్పటికే ముహూర్తం ఫిక్స్ కాగా.. తాజాగా వాయిదా పడినట్లు అనౌన్స్‌మెంట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు 'ప్రయాణానికి ముందు ఒక ఊహించని మలుపు.. చంద్రయాన్ ట్రైలర్ లాంచ్ ప్రణాళికల్లో అనుకోని మార్పులు చోటుచేసుకున్నాయి.. కానీ అసలు సందడి ఇంకా ముగియలేదు! కొత్త కౌంట్‌డౌన్ మొదలైంది.

మరిన్ని అప్‌డేట్స్ కోసం వేచి ఉండండి!' అంటూ ప్రకటించారు. కానీ ఇంకా మాత్రం ఫిక్స్ కాలేదు. కాగా.. శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్‌పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన 'చంద్రయాన్' సినిమా ఈ నెల 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతుంది. అయితే.. ఇప్పుడు ట్రైలర్ లాంచ్ ఈవెంట్ వాయిదా పడటంతో సినిమా రిలీజ్ కూడా వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా.. ఇప్పుడు విడుదల చేసిన పోస్టర్‌లో రిలీజ్ డేట్ లేకపోవడం గమనార్హం.



'సూర్య'పై దుమారం!



బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సూర్య: అంత సే ఆరంభ్ తక్' ట్రైలర్‌పై వైద్య వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ చిత్రంలో డాక్టర్ల కమ్యూనిటీని తప్పుగా చిత్రీకరించారని, వైద్యులను విలన్లుగా చూపించడమే కాకుండా వారిపై హింసను ప్రేరేపించేలా సన్నివేశాలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

తప్పుడు వైద్య పరీక్షలు, ఛార్జీల ఆరోపణ..

డాక్టర్లు అందరూ ఉద్దేశపూర్వకంగా తప్పుడు టెస్టులు చేస్తారని, కమీషన్ల కోసం ఓవర్ ఛార్జ్ చేస్తారని ఈ సినిమాలో చూపించడాన్ని విమర్శకులు తప్పుపడుతున్నారు. దాంతో పాటు సినిమాలో డాక్టర్లు, నర్సులు, ఆసుపత్రి సిబ్బందిని విచక్షణారహితంగా కొట్టే సన్నివేశాలను హీరో పాత్ర చేయడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. రీల్, రియల్ లైఫ్ మధ్య తేడా సులభంగా గుర్తించలేని సాధారణ ప్రజలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

ఎన్ఎంసీ మౌనంపై ప్రశ్నలు..

నేషనల్ మెడికల్ కమిషన్ డాక్టర్లు తమను తాము ప్రమోట్ చేసుకోవడాన్ని నిషేధిస్తుందని, కానీ ఒక పెద్ద సినిమా వైద్య సమాజాన్ని మొత్తంగా దోషులుగా, విలన్లుగా చిత్రీకరిస్తున్నప్పుడు అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. డైరెక్టర్లపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని, ఈ సినిమాను తక్షణమే బ్యాన్ చేయాలని కోరుతున్నారు. ఈ తరహా చిత్రాలు ఇప్పటికే బలహీనపడిన డాక్టర్-పేషెంట్ (రోగి-వైద్యుడు) సంబంధాన్ని మరింత దెబ్బతీస్తాయని, ప్రజల్లో వైద్యులపై అపనమ్మకాన్ని పెంచుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్విస్ట్ చెబితే కోటి రూపాయలు!



జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్‌పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ ఈ నెల 30న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతుండగా.. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను డైరెక్టర్ హరీశ్ శంకర్ చేతుల మీదుగా గ్రాండ్ గా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ హరీశ్ శంకర్ మాట్లాడుతూ.. 'ఈ ఈవెంట్‌కు వచ్చాక పూర్వాజ్‌తో మాట్లాడుతూ సినిమా బడ్జెట్ ఎంత అయ్యింది అని అడిగాను. ఆయన బడ్జెట్ ఎంతో చెప్పారు. ఆయన చెప్పిన బడ్జెట్‌లో ఇంత మంచి క్వాలిటీ సినిమా చేయడం గొప్ప విషయం.

ట్రైలర్‌లోనే సినిమా క్వాలిటీ ఎంత బాగుందో తెలిసిపోతోంది. పూర్వాజ్, జ్యోతి ఇద్దరూ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ గారికి అభిమానులు. వారి అభిమానమే నన్ను ఈ ఈవెంట్‌కు వచ్చేలా చేసింది. న్యూరో లింక్‌కు సంబంధించిన నేపథ్యమున్న కథ ఇది. ఈ మధ్య ఎలాన్ మస్క్ న్యూరో లింక్‌పై పరిశోధనలు చేయిస్తున్నారు. ఈ న్యూరో లింక్ సూపర్ షీని కలిస్తే ఎలా ఉంటుంది అనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా ఉండబోతోంది. కచ్చితంగా అందరికి కనెక్ట్ అవుతుంది' అంటూ కిల్లర్ టీమ్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు డైరెక్టర్. ఇక ఇదే ఈవెంట్‌లో 'మా మూవీ సెకండాఫ్‌లోని ట్విస్ట్ ఊహించి చెబితే కోటి రూపాయల బహుమతి ఇస్తాం' అంటూ ప్రొడ్యూసర్, డైరెక్టర్ పూర్వాజ్ చేసిన కామెంట్స్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి.



అన్నయ్య పాణంలో పూసిన పువ్వులు

శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ చిత్రం 'భోగి'. తాజాగా ఈ మూవీ నుంచి 'అన్నయ్య పాణంలో పూసిన పువ్వులు' వీడియో సాంగ్ విడుదలైంది. చెల్లెళ్లను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, తండ్రిలా ప్రేమించే అన్నయ్య అనుబంధాన్ని ఈ పాట ప్రతిబింబిస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, చంద్రబోస్ సాహిత్యం రాశారు. శ్రీకృష్ణ ఆలపించిన ఈ పాటను ఆదిత్య మ్యూజిక్ విడుదల చేసింది. చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో, కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. ఇప్పుడు రిలీజైన సాంగ్‌తో మరింత హైప్ పెరిగింది. ఇక భారీ అంచనాల మధ్య ఈ మూవీ నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతోంది.